వ్యవస్థలను చులకనగా చూడొద్దు

- మండలిపై ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు సరికాదు
- పాలకులు గత ప్రభుత్వాలపై కక్షపూరితంగా వ్యవహరించొద్దు
- నల్లగొండలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జనవరి 12(నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థనూ చులకనగా చూడరాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శాసన మండలిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో గెలుపొందిన వారే చట్టసభలకు వస్తారని, ఎవరినీ తక్కువ చేసి మాట్లాడకూడదని సూచించారు. చట్టసభల గౌరవం మరింత పెరగాలంటే సభ్యుల మధ్య పరస్పర గౌరవాభావం ఉండాలన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారిపై ఆ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన నల్లగొండలోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడ్డాక పాత ప్రభుత్వంపై కక్షపూరితంగా వ్యవహరించుకోవాలనుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఏదైనా తప్పులు జరిగితే నిష్పక్షపాతంగా విచారణ జరగాలి గానీ, ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం సరికాదని సూచించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తరహా కక్షపూరిత చర్యలు తెలంగాణలోకి రావద్దని కోరుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనపై అప్పుడే ఓ అంచనాకు రాలేమని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఆదేశిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి నల్లగొండ లేదా భువనగిరి నుంచి పోటీ చేస్తారని తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ప్రజల తాగునీటి ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి ఉంటుందని అన్నారు. మిషన్ భగీరథ పథకంలో పెండింగ్‌లో ఉన్న కరెంటు, ఇతర చెల్లింపులు చేయాలని చెప్పారు. నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల కోసం జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.

శుక్రవారం తెలంగాణభవన్‌లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

పూర్తి బాధ్యత నాదే

మొదటిపేజీ తరువాయి...

విశ్లేషించారు. 'పరిపాలన మీద దృష్టిపెట్టి పార్టీని పట్టించుకోలేదు. ఇందుకు పూర్తి బాధ్యత నాదే' అని కే తారకరామారావు చెప్పారు. బీఆర్‌ఎస్‌లో సంస్థాగత నిర్మాణం సరిగ్గా జరగలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సరైన గుర్తింపును ఇవ్వలేకపోయామని అన్నారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోలేదని తెలిపారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కేంద్రంగా పార్టీని నడపటం సరికాదని వెల్లడించారు. ప్రభుత్వానికి, పథకాలకు నడుమ కార్యకర్త లేకుండా నేరుగా లబ్ధిదారుడికే చేరడం వల్ల ఓటరుకు, కార్యకర్తకు లింకు తెగిందని విశ్లేషించారు. 6 లక్షలకు పైగా రేషన్ కార్డులు, ప్రతి నియోజవర్గంలో 15 వేలకు వరకు కొత్త పింఛన్లు ఇచ్చినా జనంలోకి తీసుకెళ్లలేకపోయామని వివరించారు. దళితబంధు కొందరికే రావడంతో మిగతావారు ఓపికపట్టలేక అసహనం ప్రదర్శించి వ్యతిరేకమయ్యారని, ఇతర కులాల్లోనూ వ్యతిరేకత వచ్చిందని శ్రేణులు చెప్పినట్టు పేర్కొన్నారు. కారు సర్వీసింగ్‌కు వెళ్లిందని, షెడ్డుకు కాదని చమత్కరించారు.

సర్కారు రెచ్చగొట్టే వైఖరి వల్లే రంగంలోకి దిగాం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం ఇవ్వాలనే సదుద్దేశంతో ఉన్నా, తమను ప్రభుత్వం రెచ్చగొట్టడం వల్లే రంగంలోకి దిగాల్సి వచ్చిందని కేటీఆర్ వివరించారు. గవర్నర్ ప్రసంగం ద్వారా ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ కవ్వింపు చర్యలకు దిగిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్నవి అసత్యాలు అని చెప్పాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, అందుకే ప్రభుత్వం శ్వేత పత్రాలకు, స్వేదపత్రం విడుదల చేశామని వివరించారు. కొత్తగా ప్రభుత్వం కుదురుకునేందుకు చేయాల్సిన ప్రయత్నాన్ని విడిచిపెట్టి, ప్రతిపక్షంలో ఉన్న తమపై అభాండాలు వేస్తే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. త్వరలో స్వయంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్ రావు అసెంబ్లీకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని అన్నారు.

పార్టీ చుట్టూ ఎమ్మెల్యేలు తిరగాలి

పార్టీని అన్ని స్థాయిల్లో సంస్థాగతంగా నిర్మిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీలను వేసి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. ఇక నుంచి పార్టీలో క్రమశిక్షణారాహిత్యానికి చోటులేదని తేల్చిచెప్పారు. ఎంత పెద్దవారైనా సరే పార్టీ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే చుట్టూ పార్టీ కాకుండా, పార్టీ చుట్టే ఎమ్మెల్యే తిరిగే విధానం రాబోతున్నదని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మనది తెలంగాణ ప్రజల టీమ్

బీఆర్‌ఎస్ ఎప్పటికీ బీజేపీకి బీ టీం కాదని, అది కాంగ్రెస్ చేసిన విషప్రచారమని కేటీఆర్ అన్నారు. బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు గతంలో లేదని, భవిష్యత్తులో ఉండదని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ అసలుసిసలు లౌకిక పార్టీ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోనే కాదు దేశంలో కాంగ్రెస్, బీజేపీని ఎదుర్కొనే సత్తా ఒక్క బీఆర్‌ఎస్‌కే ఉన్నదని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలను ఓడించింది బీఆర్‌ఎస్ పార్టీయేనని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత గులాబీ సైనికులపై ఉన్నదని అన్నారు. బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలని కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసొచ్చిన తెల్లారే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ తీరులో మార్పు వచ్చిందని చెప్పారు. ఆ రెండు పార్టీలు కుమ్మక్కుతోనే రెండు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు వేర్వేరుగా జరిగేలా నోటిఫికేషన్ జారీ అయ్యిందని అన్నారు. ఎమ్మెల్సీ ఉపఎన్నికల తీరుపై హై కోర్టుకు వెళితే నిరాశ మిగిలిందని తెలిపారు. బీజేపీ మతాన్ని రాజకీయం కోసం వాడుకుంటున్నదని ధ్వజమెత్తారు. తాము యాద్రాద్రి అక్షింతలను నల్లగొండ, భువనగిరిల్లో పంచితే గెలిచే వాళ్లమేమోనని అభిప్రాయపడ్డారు. బీజేపీ వాళ్లు పొలిటికల్ హిందువులు అయితే కేసీఆర్ మతాన్ని మతంగా చూసే హిందువు అని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూచుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బొడకుంటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు, మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్ సహా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గడువు ఇచ్చినందుకే గుర్తుచేస్తున్నాం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది ఆరు గ్యారెంటీలే కాదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా, యువత డిక్లరేషన్లలో మొత్తం 420 హామీలున్నాయని కేటీఆర్ పునరుద్ఘాటించారు. నిరుద్యోగభృతి, పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదా వంటి హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే నాలుక మడతేసిందని విమర్శించారు. రైతుబంధు రాక, కరెంటు కోతలతో ప్రజలు ఆ పార్టీపై అసహనంతో ఉన్నారని చెప్పారు. సరిపడా బస్సులు లేక మహిళా ప్రయాణికులు, గిరాకీ లేక ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఉదహరించారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, పింఛన్ల పెంపుపై నిర్దిష్టమైన తేదీలు ప్రకటించినందునే తాము గడువును గుర్తు చేస్తున్నామని తెలిపారు. గడువులోపల హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ నేతలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

లోకం పోకడ

మీరు బుక్ చేసిన టీవీ వచ్చింది మేడం.. రాత్రి నేను వచ్చి తీసుకుపోయేవరకు మీరు వాడుకోండి!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	13.5°c	34.7°c
ఆదిలాబాద్	13.5°c	32.3°c
మెదక్	15.0°c	33.9°c
నల్లగొండ	18.0°c	33.9°c
వరంగల్	18.0°c	31.0°c
ఖమ్మం	18.0°c	32.0°c
మహబూబ్‌నగర్	18.2°c	32.7°c
హైదరాబాద్	18.5°c	30.5°c
కరీంనగర్	19.0°c	31.0°c
నిజామాబాద్	19.3°c	32.9°c

లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల అధికారులకు సీఈసీ సూచన

హైదరాబాద్, జనవరి 12(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తిగా రాబోయే లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల(సీఈవో)కు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ సూచించారు. శుక్రవారం వచ్చే పార్లమెంట్ ఎన్నికల ప్రణాళికపై సీఈసీ ఢిల్లీ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రాల ఎన్నికల అధికారులకు అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేసిన విధానాలను తెలిపారు. వెబ్‌కాస్టింగ్, ఎపిక్ కార్డుల పంపిణీ, పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన వంటి అంశాలను వివరించారు. సమీక్షలో తెలంగాణ నుంచి అడిషనల్ సీఈవో లోకేశ్ కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎప్పటికీ మీ తమ్ముడినే

- మంత్రినయ్యానని నన్ను వదిలేయకండి
- మీ సహకారం ఎల్లప్పుడూ కొనసాగాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ భావోద్వేగం
- ఢిల్లీలో మంత్రిని సన్మానించిన క్రిబ్‌కో

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణతోపాటు తనకు క్రిబ్‌కో సంస్థ సహకారం కొనసాగాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయనను క్రిబ్‌కో చైర్మన్ బీరేంద్ర సింగ్, ఎండీ అనితా రావత్‌తోపాటు ఢిల్లీ కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రతినిధి క్రిషాంక్ మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. గతంలో క్రిబ్‌కో సభ్యునిగా పొన్నం ప్రభాకర్ అందించిన సేవలను కొనియాడుతూ నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం భావోద్వేగానికి గురయ్యారు. చిన్న వయసులోనే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఐదేండ్లు పనిచేశానని, క్రిబ్‌కో ప్రోత్సాహం వల్ల ఎంతో ఎదిగానని చెప్పుకొచ్చారు. ఆ ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మర్చిపోలేనని తెలిపారు. 'మీ ప్రోత్సాహం, ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని వాంఛిస్తున్నా. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే. అలాగే నేను ఇప్పుడు మంత్రినైనా మీకు మాత్రం తమ్ముడినే. మీ ప్రేమాభిమానాలను ఎప్పుడూ పొందాలని కోరుకుంటున్నా. మంత్రి అయ్యానని నన్ను ఒదిలేయకండి' అని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచంలోనే అగ్రగామిగా భారత రైల్వే: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): భారత రైల్వే వ్యవస్థ రానున్న పదేండ్లలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా దేశంలో రైల్వే నెట్‌వర్క్ స్థాయిని మరింత పెంచుతున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఏపీలోని గుంటూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుంటూరు నుంచి కొత్తగా మూడు (గుంటూరు-విశాఖ, నర్సాపూర్-హుబ్లీ, రేణిగుంట-కడప) రైళ్లను ప్రారంభించినట్టు తెలిపారు. రైలు మార్గాల విద్యుదీకరణకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఏపీలో అన్ని లైన్లను విద్యుదీకరించామని చెప్పారు. ఏపీలో కొత్తగా 371 కి.మీ. రైలు మార్గాన్ని నిర్మించామని, రైల్వేకు నిధుల కొరత లేకుండా చూస్తున్నామని తెలిపారు.

కైట్ ఫెస్టివల్‌కు 16 దేశాల ప్లేయర్స్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ కైట్ ఫెస్టివల్‌లో 16 దేశాల నుంచి 40 మంది కైట్ ప్లేయర్స్ పాల్గొననున్నారు. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే ఈ కైట్ ఫెస్టివల్‌లో 15 వరకు గాలిపటాలను ఎగురవేస్తారు. ఈసారి ప్రత్యేకంగా రాత్రివేళ పతంగులు ఎగురవేసేలా ప్రణాళికలు రచించారు.

బీసీలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి: జాజుల

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలను బీసీలకే కేటాయించాలని కాంగ్రెస్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్.. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గానికి 2 చొప్పున 34 అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, చివరకు 22 స్థానాలతోనే సరిపెట్టిందని గుర్తుచేశారు.

మాపై కోపాన్ని రైతు మీద చూపొద్దు

రైతాంగాన్ని కాపాడండి.. యాసంగికి నీళ్లు ఇవ్వండి • పంట దిగుబడి తగ్గించొద్దు: పోచారం

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): 'రాజకీయంగా కక్ష సాధించాలని మీకు ఉంటే మా మీద విచారణ చేపట్టండి. నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోండి. అంతే కానీ రైతుల మీద చూపెట్టకండి. రైతులకు యాసంగి నీళ్లు ఇవ్వండి' అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రిజర్వాయర్లలో యాసంగికి సరిపడా నీళ్లున్నాయని, వాటిని సకాలంలో రైతులకు విడుదల చేయాలని సూచించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సమైక్య పాలనలో రాష్ట్రాన్ని ఎడారిగా మారితే కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణ చేసేందుకు జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని తామే సభలో డిమాండ్ చేశామని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం స్పందించి విచారణ చేస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. కేసీఆర్ గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించి 30 లక్షల ఎకరాలకు స్థిరీకరించడమే కాకుండా మరో 30 లక్షల ఎకరాల నూతన ఆయకట్టును సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేశారని చెప్పారు. రైతులకు రెండు పంటలు నీళ్లు ఇవ్వటం ద్వారా అద్భుతమైన పంటలు పండాయని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఏటా రెండు పంటలు పండేందుకు కారణం కేసీఆరేనని వెల్లడించారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా గోదావరి నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి రావటం వల్ల 1.30 లక్షల ఎకరాల యాసంగి పంటకు కూడా నీళ్లు అందుతున్నాయని తెలిపారు. సింగూరు పరిధిలో 40,000 ఎకరాలకు సాగునీరు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు అయినా గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయటానికి పరిమితమైందే తప్ప, రైతు పంటలకు నీళ్లు ఎలా ఇవ్వాలనే ఆలోచన చేయటం లేదని తప్పుబట్టారు.

నీళ్లు పుష్కలంగా ఉన్నా..

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లలో 27 నుంచి 30 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, వీటితో 2.5 లక్షల ఎకరాల నుంచి 3 లక్షల ఎకరాల వరకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం నీటి విడుదలపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని పోచారం అన్నారు. ప్రభుత్వం నీటిని వదలకుండా భూములను పడావు పెట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల మీద కోపమెందుకని ప్రశ్నించారు. నీటి విడుదల చేయకపోతే యాసంగిలో ధాన్యం దిగుబడి తగ్గే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం, సాగునీటి శాఖ మంత్రి, అధికారులు తక్షణమే నిర్ణయం తీసుకుని నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 150 టీఎంసీలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల్లోనూ సరిపడా నీరు ఉన్నదని చెప్పారు.

కొయినా డ్యాం నీళ్లు మనకెందుకు?

నాగార్జునసాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిని కాదని, 1,300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొయినా డ్యాం (మహారాష్ట్ర) నుంచి నీటిని తీసుకువస్తామని ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకోబోతున్నదని, దీని వల్ల నష్టమే కానీ లాభం లేదని పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొయినా డ్యాం నుంచి 30 టీఎంసీలు రాష్ట్రానికి చేరేసరికి 3 టీఎంసీలు కూడా అందవని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొరత ఏర్పడితే దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

శుక్రవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి

తెలంగాణ హక్కుల సాధనలో రాజీపడం

- దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్
- 'హస్తం' పార్టీ వైఫల్యాలను ఎండగడతాం
- దాడులు, ప్రొటోకాల్ సమస్యపై లీగల్ కమిటీలు ఏర్పాటుచేస్తాం
- అభ్యర్థులను నిర్ణయించేది కేసీఆరే
- మీడియాతో మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హక్కుల సాధనలో బీఆర్‌ఎస్ పార్టీ, కార్యకర్తలు ఎప్పటికీ రాజీపడబోరని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం పలువురు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో అందించిన కేసీఆర్ ముఖ్యమంత్రి కాకపోవడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో బాధితులకు ఏ పథకమైనా నేరుగా ఆన్‌లైన్ ద్వారానే అందించామని గుర్తుచేశారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలకు ఎలాంటి అడ్డంకులు రాలేదని చెప్పారు. కాంగ్రెస్ వచ్చీరాగానే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. డిసెంబర్ 9నే రైతుబంధు, రైతుబీమాపై స్పష్టత ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. నేటికీ వాటి అమలుపై సరైన చర్చ పెట్టలేదని ఆరోపించారు. ప్రజాపాలన దరఖాస్తులు రోడ్లపై పారేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పట్టుదలతో ఉన్నట్టు చెప్పారు. ప్రజల ఆకాంక్షలే తమకు ముఖ్యమని, కేసీఆర్ ఆదేశాల మేరకు భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. అయితే, కొత్త ప్రభుత్వం స్థిరపడేందుకు కొంత సమయం ఇవ్వాలని కేసీఆర్ సూచించినట్టు గుర్తుచేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశాల్లో వచ్చే అభిప్రాయాలను నేరుగా కేసీఆర్‌కు పంపుతున్నామని, ప్రధాన సమస్యలు, కొత్త అంశాలపై కేసీఆర్ కార్యకర్తలకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారని జగదీశ్‌రెడ్డి తెలిపారు.

ఎంపీ ఎన్నికల్లో మంచి ఫలితాలొస్తాయి

వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అన్నిస్థానాల్లో గెలుస్తుందని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. వరసగా ఆయా పార్లమెంట్ స్థానాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి.. పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలనే ధీమా కార్యకర్తల్లో కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివాళాకోరు విధానాలే తమకు కలిసి వస్తాయనే నమ్మకం కార్యకర్తల్లో ఉన్నదని చెప్పారు. అభ్యర్థుల ఎంపికపై అన్ని కోణాల్లో సమాలోచనలు చేస్తున్నామని వెల్లడించారు. అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తారని పేర్కొన్నారు. తమకు ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న భౌతిక దాడులు, ప్రొటోకాల్ సమస్యలపై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో లీగల్ కమిటీలు వేస్తున్నట్టు తెలిపారు. తప్పుడు కేసుల్లో బాధితులకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎంపీలుగా తాము పార్లమెంటులో విభజన సమస్యలపై నిరంతరం పార్లమెంటులో కొట్లాడామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ సమస్యలపై ఎన్నడూ మాట్లాడలేదని గుర్తుచేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉన్నదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

2 లక్షల ఉద్యోగాల క్యాలెండర్ ఏదీ?

సీఎం రేవంత్‌రెడ్డి జవాబు చెప్పాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలోనూ లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏండ్లలో 3,23,396 మందికి ఐటీ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తే కేసీఆర్ ప్రభుత్వం కేవలం పదేండ్లలోనే 10 లక్షల మందికి ఉపాధి కల్పించిందని చెప్పారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పార్టీ నేత గుత్తా అమిత్‌రెడ్డి తదితరులతో కలిసి కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ అసత్యాల పునాదిపై నిరుద్యోగ యువతను తప్పుదారి పట్టించిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం నిరుద్యోగ యువతకు తప్పుడు సంకేతాలిచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం 1,60,083 ఉద్యోగాలు భర్తీ చేసింది నిజమా? కాదా? చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యోగాల భర్తీ చేసిందని, శాఖల వారీగా భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను వెల్లడించారు. 1,60,083 ఉద్యోగాల భర్తీతోపాటు 42,652 ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించి ఫలితాల దశలో ఉన్నాయని స్పష్టంచేశారు. కేసీఆర్ సర్కార్ అసలు ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రచారం చేసిన కాంగ్రెస్.. ఈ నెల 4న తేదీన చెల్లించిన ఉద్యోగుల వేతనాల్లో కేసీఆర్ హయాంలో భర్తీ అయిన ఉద్యోగులు జీతాలు తీసుకున్నారో? లేదా? చెప్పాలని డిమాండ్ చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

న్యాయస్థానంలో తేల్చుకుంటాం

కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్ తన మీద వేసిన పరువు నష్టం దావాను కోర్టులో తేల్చుకుంటానని కౌశిక్‌రెడ్డి చెప్పారు. పీసీసీ అధ్యక్ష పదవిని సీఎం రేవంత్‌రెడ్డి రూ.50 కోట్లు పెట్టి తెచ్చుకున్నారని అప్పటి కాంగ్రెస్ నేతలు, ప్రస్తుత మంత్రుల్లో ఒకరైన కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్నే తాము ఉదహరించానని, అందులో తానేమీ కొత్తగా చెప్పలేదని అన్నారు.

మారనున్న వికారాబాద్ జిల్లా స్వరూపం

- ఐదు నియోజకవర్గాలు, 30 మండలాలతో పునర్విభజన?
- వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన సీఎం రేవంత్

వికారాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): జిల్లాల పునర్విభజన ప్రక్రియపై పునర్విచారణ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వికారాబాద్ జిల్లాలో కొత్త చర్చకు తెరలేసింది. జిల్లాల పునర్విభజన ప్రక్రియను మళ్లీ చేపడితే వికారాబాద్ పెద్ద జిల్లాగా మారనున్నదనే సంకేతాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం మొత్తాన్ని పూర్తిగా వికారాబాద్ జిల్లా పరిధికి తీసుకువచ్చే యోచనలో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గ పరిధి వికారాబాద్ జిల్లాతోపాటు నారాయణపేట జిల్లాలో ఉన్నది. కొడంగల్, బొంరాసుపేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలో ఉండగా, కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు నారాయణపేట జిల్లాలో ఉన్నాయి. పర్యాటకరంగంతోపాటు అన్ని విధాలుగా వికారాబాద్ జిల్లాను అభివృద్ధి చేసేందుకు అనుకూలంగా ఉండటంతోపాటు రీజినల్ రింగ్ రోడ్డుకు సమీపంలోనే ఉండటంతో కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను కూడా జిల్లా పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న పరిగి నియోజకవర్గ పరిధిలోని గండీడ్, మహ్మదాబాద్ మండలాలను కూడా వికారాబాద్ జిల్లాలో కలుపనున్నట్టు తెలిసింది. చేవెళ్ల నియోజకవర్గం మొత్తాన్ని కూడా వికారాబాద్ జిల్లాలో విలీనం చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండలం వికారాబాద్ జిల్లా పరిధిలో ఉండగా, మిగిలిన మండలాలను కూడా వికారాబాద్ జిల్లా పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నట్టు తెలిసింది.